క్లుప్తంగా

ఉపాధి కూలీలకు పనులు కల్పించాలి



అమడగుంట్లలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ మోదీన్‌బాషా

కోడుమూరు రూరల్ : ఉపాధి కూలీలకు పనులు కల్పించాలని ఏపీఓ మోదీన్‌బాషా సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మండలంలోని అమడగుంట్ల, ఎర్రదొడ్డి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏపీఓ ఉపాధి కూలీల హాజరు, మస్టర్లను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. గ్రామాల్లో పనులు అవసరమైన కూలీలు ముందుకొస్తే ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన కొలతల ప్రకారం కూలీలు పనులు చేస్తే రోజువారి వేతనం రూ.300లు పడుతుందని సూచించారు.

రేపు ఉచిత యోగా శిబిరం

కర్నూలు కల్చరల్: ఇషా సంస్థ ఆధ్వర్యంలో డిసెంబర్ 1వ తేదీ ఉదయం 10.30 గంటలకు ఎస్వీ కాంప్లెక్స్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఉచిత యోగా శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఏడు సంవత్సరాల వయసు పైబడిన వారందరూ పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు http://irha.co/free yofakr nl వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 96636 55003 నంబర్‌ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

ఇంటింటి సర్వే పరిశీలన



మహిళ బరువును పరిశీలిస్తున్న అధికారులు

కర్నూలు (రూరల్) : మండల పరిధిలోని పసుపల గ్రామంలో ఆరోగ్య సిబ్బంది నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను శుక్రవారం జిల్లా ఇమ్యూజేషన్ అధికారి నాగప్రసాద్, ఆశా జిల్లా అధికారి ప్రసాద్ పరిశీలించారు. బీపీ, షుగర్, క్యాన్సర్ స్రినింగ్ పరీక్షలు తీరుపై ప్రజలను వారు అడిగి తెలుసుకున్నారు. ప్రతిఒక్కరూ తమ ఆరోగ్య పరిస్థితిని సిబ్బందికి వివరించాలని ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ వెణుగోపాల్‌రెడ్డి, సీహెచ్‌ఓ నమ్రత, ఏఎన్‌ఎం కళావతి ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం !



ఎస్సీ కాలనీ రహదారిపై నిలిచిన మురుగునీరు, చెత్తచెదారం

కర్నూలు (రూరల్) : గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. ఎక్కడికక్కడ చెత్తచెదారం కుప్పలుతెప్పలుగా దర్శనమిస్తున్నాయి. ప్రత్యేకించి జి.శింగవరం ఎస్సీ కాలనీలో దుర్గంధం వెదజల్లుతోంది. ఆ కాలనీ మీదుగా వెళ్లాలంటే ముక్కుమూసుకోవాల్సిందే అన్నట్లుగా ఉంది పరిస్థితి. మురుగునీరు ఇళ్ల ఎదుటే నిలిచిపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. దోమలు, విష కీటకాలు బారినపడి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. సమస్యను విన్నవించినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాని కోరుతున్నారు.

6న విశ్వకర్మ పథకంపై అవగాహన సదస్సు



వినతిపత్రం అందిస్తున్న బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవపూజ

కర్నూలు(అర్బన్): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విశ్వకర్మ పథకంపై అవగాహన కల్పించేందుకు డిసెంబర్ 6న సదస్సును ఏర్పాటు చేసినట్లు ఏపీ బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవపూజ ధనుంజయ ఆచారి తెలిపారు. స్థానిక బీ క్యాంప్‌లోని బీసీ భవన్‌లో ఉదయం 10 గంటల నుంచి ఈ సదస్సును నిర్వహించనున్నట్లు చెప్పారు. పథకం ఉద్దేశం, రుణాల మంజూరు, చెల్లింపులు తదితర వాటిని వివరించేందుకు వీలుగా ఇండస్ట్రీస్, బీసీ కార్పొరేషన్, ఈడ్ బ్యాంకు తదితర ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు హాజరు కావాలని కోరుతున్నామన్నారు. ప్రభుత్వ అధికారులు హాజరయ్యేందుకు వీలుగా జిల్లా కలెక్టర్ ద్వారా వారందరికీ ఉత్తర్వులు ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం ఆయన బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో పర్యవేక్షకులు శ్రీధర్‌ను కలిసి వినతి పత్రం అందించారు.

కొనలేం... తినలేం!



అమ్మకానికి సిద్ధంగా ఉంచిన పప్పుదినుసులు



మార్కెట్‌లో అమ్మకానికి ఉన్న కూరగాయలు

- ఆకాశాన్నంటిన నిత్యావసర సరుకుల ధరలు
- కొండెక్కిన కూరగాయల రేట్లు
- సామాన్యులపై పెరిగిన భారం

గడివేముల: ప్రస్తుత పరిస్థితి కొనలేం... తినలేం అన్నట్లుగా ఉంది. నిత్యావసర సరుకులతోపాటు కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. బియ్యం, పప్పుదినుసులు అందనంత ఎత్తుకు ఎగబాకాయి ధరలు. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలు విలవిలలాడుతున్నారు. వంటల్లో సర్వసాధారణంగా వాడే పప్పుదినుసుల ధరలు రోజు రోజుకు మండిపోతున్నాయి. కంది, శనగ, మినప, తదితర పప్పుల ధరలు పేదలకు పెనుభారంగా మారాయి. ఇటీవల పప్పుల దిగుమతులపై దిగుమతి సుంకం 15 శాతం కేంద్రం ఎత్తేసింది. దీంతో ధరలు కాస్త తగ్గాయి. ఎన్నికలు ముగియగానే ధరలు మంట పుట్టింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా రేట్లు పెరుగుతున్నాయి. నానాటికి పరుగు పెడుతున్న ధరలు మరో పది రోజుల్లో కిలోపై 20 శాతం పెరిగే అవకాశముందని వర్తకులు అంచనా వేస్తున్నారు. పది రోజుల కిందట రూ.160 పలికిన అకోలా కందిపప్పు ప్రస్తుతం 185 రూపాయలకు చేరింది. శనగపప్పు కిలో రూ. 95, మినపపప్పు రూ.140, బియ్యం సోనామసూరి సాధారణ రకం ప్రారంభ ధర కిలో రూ.60 నుంచి రూ.70కి చేరింది. దీంతో సామాన్యులు లెక్కలు వేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. వర్షాభావ పరిస్థితుల మూలంగా దిగుబడులు తగ్గాయని కొందరు అంటుండగా బడా వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించడమే ధరలు పెరగడానికి కారణని మరొకందరు విమర్శలు చేస్తున్నారు. సమస్య ఏదైనా నిత్యావసర సరుకుల ధరలు మిన్నంటడంతో సామాన్యులు విలవిలలాడుతున్నారు.

ఘాటెక్కిన వెల్లుల్లి....

పప్పుల ధరలతో హడలిపోతున్న పేద, మధ్య తరగతి ప్రజలకు ఆకు కూరలు, కూరగాయలు ధరలు సైతం చుక్కలు చూపుతున్నాయి. ప్రత్యేకించి ధర ఆకాశాన్నంటింది. ఏకంగా కిలో 180 చేరింది. అదేవిధంగా టమాటా కిలో రూ.40, క్యారెట్ రూ.50 పలుకుతోంది. ఉల్లి రూ.40, అల్లం రూ.150, మిర్చి రూ. 80 వరకు ఎగబాకింది. బహిరంగ మార్కెట్లో వంట నూనెల ధరలు కొంత మేర నిలకడగా ఉన్నాయి. గతంలో ఉన్న సుంకాన్ని కేంద్ర ప్రభుత్వం తగ్గించడం, పామాయిల్ ఎగుమతులపై ఆంక్షలు ఉండడంతో ఈ ధర అదుపులో ఉందాని వ్యాపారులు చెబుతున్నారు. పామాయిల్ లీటర్ ధర రూ.86, ప్రీడం రూ.110 పలుకుతోంది.

గుడ్ల ధర పైపైకి..

ప్రతి ఇంట్లో సర్వసాధారణంగా వినియోగించే కోడి గుడ్ల ధరలు పైపైకి చేరాయి. నెల కిందట గుడ్డు రూ.5.75 ఉండగా తాజాగా ఆరు రూపాయలు దాటింది. 30 గుడ్లతో కూడిన అట్ట 15 రోజుల కిందట రూ.160 ఉండగా ప్రస్తుతం రూ.180 దాటింది. ప్రభుత్వ పాఠశాలు, వసతిగృహాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారంలో భాగంగా గుడ్డు అందించాల్సి ఉండడం, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హోటళ్లలో వీటి వినియోగం అధికంగా ఉండటంతో డిమాండ్ పెరిగిందనే ప్రచారం ఉంది.

ఏమీ కొనలేని పరిస్థితి



నిత్యావసర సరుకుల ధరలు బాగా పెరిగిపోతున్నాయి. కిలో కందిపప్పు రూ.180 ఉంటే ఏమి చేయాలో అర్థం కావడం లేదు. కిలో శనగపప్పు రూ. 90 అంటున్నారు. ఏమీ కొనలేని పరిస్థితి. కూరగాయల ధరలు కూడా అందుబాటులో లేవు. కూరగాయల మార్కెట్‌కు రూ. 500 తీసుకెళ్తే కనీసం సంచి నిండడం లేదు. అధిక ధరలతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇక మునుముందు ఈ ధరలు ఎలా ఉంటాయోనని భయం వేస్తుంది.

– శివశంకర్, గడివేముల

వీధికుక్కల దాడిలో ఇద్దరికి గాయాలు

సి.బెళగల్: మండలంలోని కంబదహాల్ గ్రామంలో వీధి కుక్కల దాడిలో ఇద్దరికి గాయాలు అయాయ్యయి. గ్రామంలోని వేర్వేరు వీధుల్లో ఉప్పరి వెంకన్న, సత్యనారాయణ రెడ్డి కుక్కల కాటుకు గురయ్యారు. బాధితులు సి.బెళగల్ పీహెచ్‌సీలో వైద్యం చేయించుకున్నారు. మండలంలోని అన్ని గ్రామాలలో వీధికుక్కల బెడతో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్‌జీఎంలో సెగ్మెంట్ క్లబ్ ఏర్పాటు

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాల సీఈసీ ఆధ్వర్యంలో 77 సెగ్మెంట్ కౌన్సెలింగ్ క్లబ్ ఏర్పాటు చేశారు. కళాశాల డీన్ అశోక్ కుమార్ మాట్లాడుతూ ఈ క్లబ్‌లో 7రకాల సాంకేతిక విభాగాల ద్వారా విద్యార్థులకు పలు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో క్లైన్సిల్ కో-ఆర్డినేటర్ ప్రియదర్శిని, డీన్ రామిరెడ్డి, సతీష్, భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు శివపార్వతుల కల్యాణోత్సవం

కర్నూలు కల్చరల్: ఓర్వకల్ మండల పరిధిలోని నన్నూరు గ్రామంలో రాగమయూరి గ్రీన్ హిల్స్ శ్రీ విద్యాసుందర సరస్వతి పీఠంలోని సరస్వతీ ఆలయంలో డిసెంబర్ 1వ తేదీ సాయంత్రం 6.10 గంటలకు శివపార్వతుల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి యశోధర కుమారశర్మ పేర్కొన్నారు. జ్వాలాతోరణం, దీపోత్సవం, తీర్థ ప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు.

15లోపు ప్రీమియం చెల్లించాలి



బ్రాహ్మణదొడ్డి రైతుసేవా కేంద్రంలో రికార్డును పరిశీలిస్తున్న ఏడీఏ సాలురెడ్డి

సి.బెళగల్ : రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు సంబంధించి రైతులు బీమా ప్రీమియం డిసెంబర్ 15వ తేదీలోగా చెల్లించాలని కర్నూలు ఏడీఏ సాలురెడ్డి సూచించారు. మండలంలోని బ్రాహ్మణదొడ్డి గ్రామ రైతుసేవా కేంద్రాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఎరువులు, పురుగు మందుల వివరాల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి వసతి ఉన్న రైతులు వేరుశనగ విత్తనాలను సబ్సిడీపై అందజేయడం జరుగుతుందన్నారు. పెట్టుబడి ఖర్చులు తగ్గించుకునేలా రైతులు సాగు చేపట్టాలని, వ్యవసాయ అధికారుల సలహాలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ మల్లేష్ కుమార్, ఎంపీఈఓ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీకి నివారణయే మార్గం

ఓర్వకల్లు: ప్రాణాంతకమైన వ్యాధులలో ఒకటైన హెచ్‌ఐవీ/ఎయిడ్స్ వ్యాధికి ఎలాంటి మందులు లేవని, నివారణ ఒక్కటే మార్గమని స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ప్రసన్న పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రం ఓర్వకల్లులో జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్‌టీసీ బస్టాండ్ ఆవరణలో మానవహారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ హెచ్‌ఐవీ అంటువ్యాధి కాదని, వారిని దూరంగా ఉంచరాదన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామచంద్రారెడ్డి, ఉపాధ్యాయుడు భాస్కర్, మహిళ పోలీసు మాలేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలి



ఎస్‌ఐ శ్రీనివాసులు సమక్షంలో రాజీ అవుతున్న ఫిర్యాదుదారులు

కోడుమూరు రూరల్ : ఏదైనా సమస్యలు తలెత్తినప్పుడు సామరస్యంగా పరిష్కరించుకోవాలని కోడుమూరు ఎస్‌ఐ శ్రీనివాసులు ప్రజలకు సూచించారు. వివిధ సమస్యలకు సంబంధించి కేసులు బనాయించుకున్న ఇరు వర్గాలను శుక్రవారం ఎస్‌ఐ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. మండల పరిధిలోని కల్లపరి గ్రామానికి చెందిన ఇరువర్గాలకు కేసుల మూలంగా జరిగే నష్టాలను వివరించి రాజీకి అంగీకరింపజేశారు. ఎస్‌ఐ మాట్లాడుతూ చిన్నచిన్న విషయాలకు స్టేషన్‌లో కేసులు పెట్టుకున్న వ్యక్తులు పట్టుదలకు పోకుండా రాజీ అయితే ఇరు కుటుంబాల జీవనం బాగుంటుందన్నారు. డిసెంబర్ 14వతేదీ వరకు మెగా లోక్ అదాలత్‌లో రాజీ చేసి కేసులను కొట్టివేయడం జరుగుతుందన్నారు. స్టేషన్ పరిధిలో 41కేసు లు పెండింగ్‌లో ఉన్నాయని, వీరందరికి స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు, రాజీ అయ్యేవారిని లోక్ అదాలత్‌కు పంపుతామన్నారు. మళ్లీ గొడవలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు.

నేడు క్యాన్సర్‌పై కాన్ఫరెన్స్

కర్నూలు (హాస్పిటల్): స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో మొదటిసారి క్యాన్సర్‌పై కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు డైరెక్టర్ డాక్టర్ సీఎస్‌కే ప్రకాష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆన్‌లైన్ ద్వారా స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు, డీఎంఈ డాక్టర్ డి.ఎస్.వి.ఎల్.నరసింహం హాజరు కానున్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, ట్రిపుల్ ఐటీ రిజిస్ట్రార్ కె.గురుమూర్తి, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు హాజరవుతున్నట్లు వెల్లడించారు. కాన్ఫరెన్స్‌లో ప్రివెన్షన్ టు పాలియేటివ్ అంకాలజీ అంశంపై నిపుణులైన వైద్యులు చర్చించనున్నట్లు తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు

- డీఎస్పీ బాబు ప్రసాద్



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ బాబు ప్రసాద్

సి.బెళగల్: శాంతి భద్రల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని కర్నూలు డీఎస్పీ విజయశేఖర్ తెలిపారు. మండల కేంద్రం సి.బెళగల్ పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం సందర్శించిన డీఎస్పీ రికార్డులను తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు, పోలీసుల నివాసాలను పరిశీలించారు. డీఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలోని గ్రామాలలో అక్రమ మద్యం కేసులు అధికంగా ఉంటున్నాయని, ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. మద్యం అక్రమ రవాణ, అమ్మకాలపై కఠినంగా వ్యవహరిస్తామని, ఎంతటివారైనా ఉపేక్షించమన్నారు. వీలైనంత త్వరలో గ్రామాలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సీఐ తబ్రే జ్, ఎస్‌ఐ తిమ్మారెడ్డిని ఆదేశించారు. అదేవిధంగా పాతనేరస్తులు, రౌడీషీటర్లపై నిఘా పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐలు నాగయ్య, ఆంజనేయులు, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్‌గా సింధు సుబ్రహ్మణ్యం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల అడ్మినిస్ట్రేటర్‌గా సింధు సుబ్రహ్మణ్యంను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 68 మంది డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేశారు. అందులో భాగంగా వెయిటింగ్‌లో ఉన్న సింధు సుబ్రహ్మణ్యంను కర్నూలుకు బదిలీ చేశారు. ఆమె ఆసుపత్రి పరిపాలనకు సంబంధించి అధికారులకు సూచనలు, సలహాలు ఇవ్వనున్నట్లు సమాచారం.

పార్కుల్లో వసతుల కల్పనకు చర్యలు



స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని మున్సిపల్ పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ రవీంద్రబాబు తెలిపారు. శుక్రవారం స్థానిక 42వ వార్డులోని వాణిజ్య నగర్‌లోని పార్కును కమిషనర్ పరిశీలించారు. కాలనీవాసులతో సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పార్కుల అభివృద్ధి, పారిశుద్ధ్య సమస్యపై దృష్టి సారించామన్నారు. పార్కులో పిచ్చి మొక్కలను తొలగించి ప్రజలకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించాలని అక్కడే ఉన్న తనిఖీదారుడిని ఆదేశించారు.

ఎక్కడి సమస్యలు అక్కడే !

- నగరపాలకలో జాడ లేని అభివృద్ధి పనులు
- టెండర్లు రద్దు – కొత్త టెండర్లు ఎప్పుడో?
- పాలకవర్గ నిర్ణయాలకు తూట్లు
- రూ.1.25 కోట్ల పనులను రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు



ధర్మపేటలో రూ.10 లక్షలతో సీసీ డ్రైనేజీ నిర్మించాల్సిన ప్రాంతం



కర్నూలు (టౌన్): 'నగరపాలక సంస్థ పరిధిలోని 47వ వార్డులో రూ.34.16 లక్షలు అంచనా వేసి ధర్మపేటలో 600 ఎంఎం డ్రైన్ నిర్మించాలని టెండర్లు పిలిచారు. స్థానికంగా మంజునాథ్ ఎలక్ట్రికల్ షాపు నుంచి సూర్య టవర్స్ వరకు ఈ పనులు చేపట్టాల్సి ఉంది. తాజాగా ప్రభుత్వం ఈ టెండర్‌ను రద్దు చేసింది. ఈ పనులు జరిగి ఉంటే అక్కడ ఎంతో కాలంగా ఉన్న ఇబ్బందులు తొలగిపోయేవి.

☛ పాతబస్తీలోని 11వ వార్డులో 110 ఎంఎం అలాగే 160 ఎంఎం సామర్థ్యం కలిగిన హెచ్‌డీ పైపులైన్ పనులకు సంబంధించి రూ.20 లక్షలతో టెండర్ పిలిచారు. డోర్ నంబర్ 16/125 నుంచి డోర్ నంబర్ 16/164 వరకు పనులు చేట్టాల్సి ఉంది. ఈ పనులు చేపట్టకముందే ఇటీవల ప్రభుత్వం రద్దు చేసింది. అక్కడ బూస్టర్ పంప్‌సెట్ ఏర్పాటు చేస్తే మంచి నీటి సరఫరాలో వచ్చే సమస్యలు పరిష్కారం అవుతాయి. టెండర్ పనులు రద్దు కావడంతో ఇప్పటికీ ఆ సమస్య పరిష్కారానికి నోచుకొలేదు.

పాలకవర్గ నిర్ణయాల అమలుకు మంగళం

నగరపాలక సంస్థ పరిధిలో స్థానిక ప్రజలు సిఫార్సు చేసిన పనులను కార్పొరేటర్లు కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చి ఆయా కాలనీలలో అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంటుంది. ముందుగా ప్రజల డిమాండ్‌ను గుర్తించి ఆ పని చేపట్టేందుకు ఇంజినీరింగ్ అధికారులు అంచనాలు వేసి, స్టాండింగ్ కమిటీలో తీర్మానం పెట్టాల్సి ఉంది. అక్కడినుంచి నగరపాలక సర్వసభ్య సమావేశంలో అందరు సభ్యులు ఆమోదం వ్యక్తం చేసిన తరువాత టెండర్లు పిలిచి పనులను సంబంధిత కాంట్రాక్టర్లకు అప్పగించాల్సి ఉంటుంది. నగరపాలక సంస్థ పరిధిలో ఒక అభివృద్ధి పని చేయాలంటే ఇంత తతంగం ఉంటుంది. ఆ పనులు పూర్తి చేస్తే కాలనీవాసులకు సౌకర్యంగా ఉంటుంది. స్థానిక కార్పొరేటర్‌కు మంచి పేరు వస్తుంది. అయితే కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో అనేక పనులు పెండింగ్‌లో ఉన్నాయి. 2022, 2023 సంవత్సరాలకు సంబంధించిన టెండర్ పనులు పూర్తి చేయాల్సి ఉంది. కొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. సకాలంలో పనులు ప్రారంభం గాకుంటే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. టెండర్స్ రివైజ్ చేసి ఇతరులకు కేటాయించాలి. మొత్తానికి కేటాయించిన అంచనా విలువతో ఆ పనులు మాత్రం చేయాల్సి ఉంటుంది. అయితే ఆరు నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కార్పొరేషన్‌లో పెండింగ్ పనుల పేరుతో జాప్యం చేస్తోంది. సకాలంలో పూర్తి చేయలేదన్న కారణంతో అనేక పనులను ఇటీవల రద్దు చేసింది. పనులపై మరోసారి చర్చించి సమస్యలు ఉంటే పరిష్కరించాల్సిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోకుండా ఏకంగా రద్దు చేయడంపై విమర్శలు వస్తున్నాయి.

రూ.1.25 కోట్ల టెండర్ పనుల రద్దు

ఆరు నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపట్టడంలో అంతులేని జాప్యం చేయడమే కాకుండా ఉన్న పనులను సైతం రద్దు చేసింది. 2019, 2020, అలాగే 2022, 2023 సంవత్సరాలకు సంబంధించిన పలు అభివృద్ధి పనులను ఈనెల 21వ తేదీ రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా కర్నూలు నగరంలో వివిధ ప్రాంతాల్లో గుర్తించిన పలు అభివృద్ధి పనులు రద్దయ్యాయి. రూ.1.25 కోట్లు విలువ చేసే పనులు రద్దు కావడంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. పనుల్లో జాప్యం, 25 పనులు పూర్తి కానందున వాటిని రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

నత్తనడకన పాలన...

నగరంలో అభివృద్ధి పనులు లేక పాలన నత్తనడకన సాగుతోంది. ఆరు నెలలు అవుతుంది. పాతబస్తీతో పాటు శివారు గ్రామాలైన మునగాలపాడు, మామిదాలపాడు, లక్ష్మీపురం, పెద్దపాడు, పందిపాడు వంటి విలీన గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది. టెండర్ల ప్రక్రియ లేక, ఉన్న పనులు రద్దు చేయడంతో అభివృద్ధికి తూట్లు పడుతున్నాయి. ఇప్పటివరకు నగరపాలక సంస్థ పరిధిలో అరకొరగా సైతం పనులు జరగడం లేదన్న విమర్శలు ఉన్నాయి. అన్న క్యాంటీన్లు తప్పా కాలనీలలో ప్రజలకు సంబంధించిన మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దగా చర్యలు చేపట్టలేదు. ఇప్పటికైనా ప్రస్తుత ప్రభుత్వం శివారు కాలనీలలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాల్సి ఉందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

నగరంలో రద్దు చేసిన కొన్ని టెండర్ పనుల వివరాలు

☛ మూడవ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని ఎస్‌టీ కాలనీలో రూ.11 లక్షలు విలువ చేసే సీసీ డ్రైన్లు, కల్వర్టులు, అప్రోచ్ రోడ్లు టెండర్ పనులు రద్దు చేశారు.

☛ 11వ వార్డు పరిధిలోని పాతబస్తీలో రూ.10 లక్షలు వెచ్చించి నిర్మించాల్సిన సీసీ డ్రైన్ పనులు

☛ పాతబస్తీలోని చాకలి వీధిలో రూ.10 లక్షలతో సీసీ డ్రైను, సీసీ రోడ్డు పనులు రద్దు

☛ 10వ డివిజన్ పరిధిలోని కూబ్ సూరత్ మసీదు పక్కన రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, సీసీ డ్రైన్ నిర్మాణ పనులను రద్దు చేశారు.

☛ 11వ వార్డులోని పాతబస్తీలో ఇంటి నంబర్ 16/87 నుంచి ఇంటి నంబర్ 16/108 వరకు రూ.10 లక్షలతో నిర్మించాల్సిన సీసీ డ్రైన్ టెండర్ పనులు రద్దు చేశారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి




విద్యుత్ భవనం ఎదుట ఆందోళన చేస్తున్న మీటర్ రీడింగ్ కార్మికులు

కర్నూలు న్యూసిటీ: విద్యుత్ మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు విద్యుత్ కార్యాలయం ముందు మీటర్ రీడింగ్ కార్మికులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మునెప్ప మాట్లాడుతూ.. మీటర్ రీడర్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో విద్యుత్ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీఓ వచ్చి ఆరు మాసాలు అవుతున్నా ఇస్రో అకౌంట్ల ద్వారా జీతాలు చెల్లించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. అర్హతలు కలిగిన మీటర్ రీడర్లకు ప్రత్యామ్నాయ ఉద్యోగాలు కల్పించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మునిస్వామి, రామాంజనేయులు, వీరేష్, రాముడు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీ స్థలం షాపులకు కేటాయించొద్దు

కర్నూలు(సెంట్రల్): మెడికల్ కాలేజీ స్థలాన్ని ప్రైవేట్ షాపులకు కేటాయించాలని మునిసిపల్ కార్పొరేషన్ చేసిన ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మెడికల్ కాలేజీ మసీదు ఎదుట ఉన్న షాపులను రోడ్డు విస్తరణ కోసం తొలగించేందుకు చర్యలు తీసుకోవడం మంచి నిర్ణయమే అన్నారు. అయితే ఆ షాపుల వారికి మెడికల్ కాలేజీ లోపల స్థలాన్ని కేటాయించాలని మునిసిపల్ కార్పొరేషన్ చేసిన ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. బాధితులకు కాలేజీలో గాకుండా బయట ఎక్కడైనా స్థలం కేటాంచుకోవాలన్నారు. అంతేతప్పా మెడికల్ కాలేజీ స్థలాన్ని ఇవ్వాలనుకోవడం మంచి నిర్ణయం కాదన్నారు. కాలేజీకి కేటాయించిన స్థలం కాలేజీకే ఉండాలన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీ నరసింహస్వామి

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని డొంగు వద్ద వెలసిన లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం శుక్రవారం వైభవంగా జరిగింది. కార్తీకమ మాస బహుళ చతుర్దశి స్వామి నక్షత్రం పురస్కరించుకుని హైదవశక్తి, దాతల సహకారంతో నిర్వ హించిన స్వామి,అమ్మవార్ల కల్యాణం కనులపండువగా నిర్వహించారు. అభిషేకాలు, అర్చనలు, ఇతర కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు.

అనుమతిలేని డయాగ్నోస్టిక్ సెంటర్లను సీజ్ చేయాలి



ధర్నా చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో అనుమతి లేని డయాగ్నోస్టిక్ సెంటర్లను సీజ్ చేయాలని, నిబంధనలు పాటించని హాస్పిటల్స్‌పై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు, నగర కార్యదర్శి బీసన్న డిమాండ్ చేశారు. శుక్రవారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి కూతవేటు దూరంలో పదుల సంఖ్యలో డయాగ్నోస్టిక్ సెంటర్లు ఎలాంటి అనుమతులు లేకుండానే నడుస్తున్నాయని, అర్హతలేని వ్యక్తులతో వైద్య పరీక్షలు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నా వీటిపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇలాంటి వాటిపై చర్యలు తీసుకునే వరకు ఉద్యమిస్తామని, అవసరమైతే వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు చంటి, నాగేశ్వరరావు, నగర ఆర్గనైజింగ్ కార్యదర్శి కృష్ణ, నగర నాయకులు నాగరాజు, శివాజీ, శివ, విన్నీ,కుమార్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.